సాక్షి
పల్నాడు

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025




చెక్‌పోస్టులో లేని తనిఖీ సిబ్బంది

ప్రత్తిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాలోకి వచ్చే వాహనాల తనిఖీకి ఏర్పాటైన పెదనందిపాడు చెక్ పోస్టు బుధవారం ఇలా సిబ్బంది లేకుండా దర్శనమిచ్చింది.



ఆకట్టుకున్న పుష్పప్రభ

రేపల్లెరూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని రేపల్లె నుంచి గులాబీలు, చామంతులతో శివలింగాకృతిలో ప్రభను అరవపల్లి బాల కోటేశ్వరస్వామి తిరునాళ్లకు తరలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 531.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

నరసరావుపేట ఈస్ట్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈనెల 27న గురువారం పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈఓ ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు.

కాకతీయ కమ్మ సత్రానికి రూ.1.85 లక్షలు విరాళం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో కాకతీయ కమ్మ సేవా సమితి సారథ్యంలో కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా కాకతీయ కమ్మ సత్రానికి రూ. లక్షా 85 వేల 66 విరాళంగా అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా గ్రామస్తుల సహకారంతో విరాళాల రూపంలో నగదు అందజేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా, కనుల పండువగా జరిగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీ గంగాపార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పర్యవేక్షణలో ఈ వేడుక వైభవంగా జరిగింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి వార్ల ఆలయాన్ని పూలతో విశేషంగా అలంకరించారు. మరో వైపు అమ్మవారి ఆలయం నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునే మార్గాన్ని సైతం పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, అరటి చెట్లతో పచ్చటి పందిరిని తలపించేలా తీర్చిదిద్దారు. మల్లేశ్వర స్వామి వారికి త్రికాల అభిషేకాలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని స్వామిని దర్శించుకుని అభిషేకాలు జరిపించారు.

రాజధానిలో దొంగల కలకలం



తాడికొండ: రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలం నెక్కల్లులోని పోలేరమ్మ ఆలయంలో జరిగిన చోరీ స్థానికంగా కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం నెక్కల్లు గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలోకి మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు గేట్లు పగులగొట్టి ప్రవేశించి అమ్మవారి వెండి వడ్డాణం, కిరీటం, హుండీలో నగదు, కానుకలు, అపహరించారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి సమాచారం తెలియకుండా ఉండేందుకు బాక్సులు సైతం తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పూజారి గుమ్మా గంగయ్య రోజు మాదిరిగానే బుధవారం ఉదయం పూజా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం దేవస్థానానికి రాగా ఆలయం గేటు, తాళం, హుండీ తాళం పగులగొట్టి ఉండటం, పోలేరమ్మ విగ్రహంపై ఉన్న నగలు కనిపించకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పట్నంబజారు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులోని వేదాంత ఆసుపత్రి సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నలుగురు వ్యక్తులు వెళుతున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రమాదం ఎలా జరిగింది, ఏ వాహనం ఢీకొందనే వివరాలు తెలియరాలేదు. ప్రమాదంలో ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చల్లా వెంకటేష్ (15), లాలాపేటకు చెందిన షేక్ అబ్దుల్ అలీ (28) మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.



అందాల హరవిల్లు : విద్యుద్దీప కాంతుల్లో శోభిల్లుతున్న కోటప్పకొండ దివ్యక్షేత్రం అంతరచిత్రం కోటప్పకొండలో కొలువైన త్రికోటేశ్వరస్వామి దివ్యమంగళ స్వరూపం



ప్రభంజనం

- కోటప్పకొండ తిరునాళ్లకు భారీగా హాజరైన భక్తులు
- అధిక సంఖ్యలో వీఐపీ పాసుల జారీతో క్యూలైన్లలో రద్దీ
- కోటయ్యను దర్శనం చేసుకున్న రాజకీయ ప్రముఖులు
- భారీ విద్యుత్ ప్రభల వద్ద భక్తుల కోలాహలం
- పెట్లూరివారిపాలెం వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

ప్రమదగణాలు ప్రణవనాదంతో పరవశించాయా.. జంగమదేవర శంఖారావంతో దిక్కులు పిక్కటిల్లాయా.. అభిషేక ప్రియుని సిగన కృష్ణాజలాలు ఆనంద తాండవమాడాయా.. వేదమంత్రోచ్చరణలకు లయబద్ధంగా గుడిగంటలు మార్మోగాయా.. అన్నట్టు మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు ఆధ్యాత్మికోత్సాహంతో ఉప్పొంగాయి. జనహృదయాలు మనోహరుడి ముందు ప్రణమిల్లాయి. పాహిమాం.. అహరహం రక్షమాం అంటూ శరణువేడాయి.

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు బుధవారం పోటెత్తారు. స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తెల్లవారుజామున 3 గంటలకు బిందెతీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనభాగ్యం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోపాన మార్గం నుంచి భక్తులు మెట్ల పూజ చేసుకుంటూ కొండపైకి చేరుకున్నారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, నంది విగ్రహం వద్ద భక్తులు పూజలు చేశారు. త్రిముఖ శివలింగం వద్ద యాత్రికులు సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. పలువురు భక్తులు కాలినడకన పాత కోటయ్య ఆలయం వద్దకు చేరుకున్నారు. కొండ కింద నుంచి 65 సప్తగిరి బస్సుల్లో ఆర్టీసీ యాత్రికులను చేరవేసింది.

ప్రభల వద్ద కోలాహలం..

కోటప్పకొండకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే భారీ విద్యుత్ ప్రభల వద్ద కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రభల నిధి వద్దకు 20 భారీ విద్యుత్ ప్రభలు చేరుకున్నాయి. వీటి ముందు నిర్వాహకులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు గుమిగూడారు.

వీఐపీ క్యూలైన్‌లో భక్తుల తోపులాట

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వీఐపీ దర్శన పాసులను అధికారులు భారీస్థాయిలో జారీ చేశారు. ఓపక్క పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ సుమారు 30 వేల వీఐపీ పాసులు జారీ చేశారని సమాచారం. ఫలితంగా పలుమార్లు ఈ క్యూలైన్‌లో తోపులాట జరిగింది. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వీఐపీ క్యూలైన్లో వారిని వీవీఐపీ క్యూలైన్ లోకి అనుమతించారు. ఫలితంగా స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. వీవీఐపీలకు రూ.200 టికెట్ కొన్న భక్తుల క్యూలైన్ ఆపి దర్శనం కల్పించాల్సి రావడంతో ఆ క్యూలైన్‌లోని భక్తులు మూడు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది.

పెట్లూరువారిపాలెంలో భారీగా ట్రాఫిక్ జామ్

నరసరావుపేట మండలం పెట్లూరువారిపాలెం వద్ద బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనాలు భారీస్థాయిలో నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. సాయంత్రం 6 గంటల నుంచి పెట్లూరివారిపాలెం నుంచి కొండకు వెళ్లే దారులన్నీ స్తంభించాయి. సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్యను నిలువరించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని భక్తులు విమర్శించారు.

పోలీసు డ్రోన్‌కు ప్రమాదం

కోటప్పకొండ వద్ద శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసులు వినియోగించిన డ్రోన్‌కు ప్రమాదం జరిగింది. పైకి లేచిన డ్రోన్ సాంకేతిక సమస్యతో ఒక్కసారిగా కిందకు పడిపోయింది. విద్యుత్ తీగలపై పడటంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే పోలీసులు విద్యుత్ నిలిపివేయించి తీగలపై పడిన డ్రోన్‌కు కిందకు దించారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రి టీజీ భరత్, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవింద్‌బాబు, యరపతినేని శ్రీనివాసరావు, బి.రామాంజనేయులు, కొలికిలపూడి శ్రీనివాసరావు, మాజీమంత్రి మేరుగ నాగార్జున, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ కృష్ణమోహన్, పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు స్వామిని దర్శించుకుని తరించారు.



ఆదుకో కోటయ్యా : కోటప్పకొండ క్షేత్రంలో భక్తజన కిటకిట

కోటయ్యకు పట్టువస్త్రాలు

సాక్షి, నరసరావుపేట: కోటప్పకొండపై వేంచేసిన త్రికోటేశ్వరుడికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం సాయంత్రం 6.30 గంటలకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అధికారులు, పూజారులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కోటప్పకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆగిపోయిన రోప్‌వే, గిరిప్రదక్షిణ మార్గం అభివృద్ధి కార్యక్రమాలను అటవీశాఖతో సమన్వయం చేసుకుని చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. దేవదాయ శాఖ పరిధిలోని కొన్ని ఆలయాల నుంచి కోటప్పకొండ ఆలయం అప్పుగా తీసుకున్న సుమారు రూ.54.5 లక్షల బకాయిలను రద్దు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్, జిల్లా దేవదాయ శాఖ అధికారి అచ్యుత్, కోటప్పకొండ ఆలయ ఈవో చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



కోటప్పకొండలో త్రికోటేశ్వరునికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

దైదలో భక్తుల రద్దీ

గురజాల/ గురజాల రూరల్ : మహా శివరాత్రి సందర్భంగా దైద గ్రామ సమీపంలోని బిలంలో కొలువైన శ్రీ అమరలింగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. వేకువనే కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అమరలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంపటి సాంబశివరావు, ఈఓ పూర్ణచంద్రరావు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. డీఎస్పీ బి.జగదీష్, సీఐ ఆవుల భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐ వినోద్ కుమార్ బందోబస్తు నిర్వహించారు. స్వామిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అమరారామం.. ఆనంద పరవశం



అమరేశ్వరస్వామి మూల విరాట్



అమరావతిలో భక్తుల పుణ్యస్నానాలు

అమరావతి: బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా బుధవారం జనసంద్రమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేకువజామున మూడుగంటలకే స్వామికి అభిషేకాలు ప్రారంభమయ్యాయి. అప్పటికే క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ప్రథమ దర్శనం కల్పించారు. అమరేశ్వర స్నానఘట్టంలో భక్తులు పితృదేవతలకు కార్యాలు జరిపించుకున్నారు. జంగమదేవర ఆశీర్వచనాలు పొందారు. రాత్రి లింగోద్భవ కాలంలో అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఈవో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాన్ని, తాగునీటిని అందించారు. బుధవారం 20 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు అంచనా.

దర్శించుకున్న వీఐపీలు

అమరేశ్వరుని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తులు జ్యోతిర్మయి, సుమతి, రవినాథ్ తివారి, రిటైర్డ్ న్యాయమూర్తి శ్యాంప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఆర్‌పీ ఠాకూర్, డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, జగన్‌మోహనరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ తదితరులు దర్శించుకున్నారు.

సత్రశాలలో సదాశివ నినాదం

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి సందర్భంగా సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం బుధవారం భక్తజనంతో పోటెత్తింది. శివనామ స్మరణతో మార్మోగింది. భక్తులు తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించారు. మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబ అమ్మవారికి శ్రీ చక్రనవవర్ణ అర్చన, కుంకుమార్చనలు, జల బిందెలతో స్వామికి అభిషేకం, గంగపూజ, మంగళ స్నానములు, ఖడ్గ ప్రదర్శన, అఖండ దీపారాధన నిర్వహించారు. దేవస్థానం ఆవరణలోని మండపంలో ప్రతిష్ఠించిన స్పర్శ స్పటికలింగం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాల నుంచి సత్రశాలకు సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చి దైవ దర్శనం చేసుకుని ఉంటారని ఈవో గాదె రామిరెడ్డి తెలిపారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాలలో భక్తులకు అన్నదానం జరిగింది. కారెంపూడి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



సత్రశాలలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



మల్లన్న స్వామి మూలవిరాట్

పట్టభద్రుల పిడికిలి

- పోలింగ్‌కు సర్వంసిద్ధం
- నేడు 90 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్
- పల్నాడు జిల్లాలోని ఓటర్లు 56,964 మంది
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం పోలింగ్ జరగనుంది. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. పల్నాడు జిల్లాలోని 56,964 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 90 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. పురుషులు 37,831 మంది, మహిళలు 19,129 మంది, ఇతరులు నలుగురు ఓటర్లుగా ఉన్నారు. 38 మంది మైక్రో అబ్జర్వర్లతో కలిపి పీవో, ఏపీవోలు, ఓపీవోలు 270 మంది ఎన్నికల విధులను నిర్వహించనున్నారు. పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళ, బుధవారాల్లో పరిశీలించారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి పోలింగ్ సామగ్రిని పీవోలు, ఏపీవోలు, పోలింగ్ సిబ్బందికి అందజేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 25 మంది పోటీలో ఉండగా వారిలో టీడీపీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్యనే ప్రధాన పోటీ ఉండనుంది. అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను చేయటంలో తలమునకలై ఉన్నారు. ఇదిలా ఉంటే ఓటరు స్లిప్‌లు ఇంటింటికి తిరిగి అందజేయాల్సిన సచివాలయ కార్యదర్శులు చాలా ప్రాంతాల్లో ఓటర్లకు ఫోన్ చేసి కార్యాలయానికి రప్పించుకొని అందజేయడం గమనార్హం.



నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్వో మురళి

క్లుప్తంగా

భక్తజన సంద్రం.. కాకాని శివాలయం



పెదకాకాని శివాలయం ప్రాంగణంలో భక్తుల రద్దీ

పెదకాకాని: పెదకాకాని శైవక్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా బుధవారం భక్తజనం పరవశంతో పులకించింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తుల కోసం ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారు స్వర్ణకవచాలంకృత భ్రమరాంబదేవిగా భక్తులను అనుగ్రహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సేవలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున స్వామి దివ్యకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం ఒక్కరోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా 6,50,000 రూపాయల ఆదాయం సమకూరినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. దాతల సహకారంతో ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, పొంగలి, దద్దోజనం పంపిణీ ఉదయం నుంచి రాత్రివరకూ సాగుతూనే ఉంది. స్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న చిన్న పిల్లలకు పాలు, భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు గుణరంజన్, హరిహరనాథ్‌శర్మ, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

నేడు రథోత్సవం

పెదకాకానిలో గురువారం స్వామి దివ్య రథోత్సవం జరుగుతుందని ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయంలో భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులను కటాక్షిస్తారని వివరించారు.



పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి మూలవిరాట్



కోటప్పకొండ ఆలయం క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు



ఆలయంలోని నందివిగ్రహం వద్ద భక్తుల కోలాహలం



ఉద్యాన శాఖ స్టాల్ వద్ద జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



కోటప్పకొండ ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం



కొండ ఎక్కి, దిగుతున్న భక్తులు



కోటప్పకొండకు వెళ్లేదారిలో హైటెన్షన్ విద్యుత్ లైన్ దాటుతున్న భారీ ప్రభ





కొండకు వస్తున్న బాల ప్రభలు

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

అన్నిదారులు కొండకే..!

- భక్తజన సంద్రంగా మారిన కోటప్పకొండ
- ప్రభుత్వ స్టాల్స్‌ను ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- ఉదయం 11.35 గంటలకే హైటెన్షన్ లైన్ దాటిన ప్రభలు
- సత్రాలలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ
- 10ఆర్ మేజర్ కాల్వలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు

నరసరావుపేట ఈస్ట్: అన్ని దారులు శివయ్య సన్నిధికే.. కోటప్పకొండలో కొలువైన శ్రీత్రికోటేశ్వరుణ్ణి దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో కోటప్పకొండ భక్తజన సంద్రంగా మారింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం కోటప్పకొండకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మహాశివరాత్రి పర్వదినాన ఇక్కడ జరిగే ప్రభల తిరునాళ్ల జాగరణకు ఉమ్మడి గుంటూరుజిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి యాత్రికులు అధికసంఖ్యలో వచ్చారు. కొండకు వెళ్లే రోడ్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ మార్గాలలో భక్తుల సందడి అధికంగా కనిపించింది. నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది.

తరలివచ్చిన భారీ ప్రభలు..

జాగరణకు చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే భారీ విద్యుత్ ప్రభలు ఉదయం 11.35గంటల సమయానికి ఈటీ వద్ద నున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ దాటి కొండదిగువ భాగంలోని మైదానంలో శివయ్యకు అభిముఖంగా కొలువుదీరాయి. కావూరు, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, గోవిందాపురం, లింగంగుంట్ల, పురుషోత్తపట్నం తదితర గ్రామాల నుంచి భారీ ప్రభలు కొండకు చేరుకున్నాయి. ప్రభల రాక సమయంలో చిలకలూరిపేట రోడ్డులో ట్రాఫిక్ నిలిచి పోవటంతో ఆర్టీసీ బస్సులు లేక భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది.

వెల్లివిరిసిన మతసామరస్యం

వివిధ ప్రభుత్వ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ద్వారా తమ శాఖలు అందించే పథకాలు, వసతులను భక్తులకు వివరించారు. ఆయా స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రారంభించారు. కొండ దిగువన వివిధ సామాజిక వర్గాలకు చెందిన సత్రాలలో ఉచిత అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే రోడ్డు మార్గంలో పలు సంస్థలు భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. గురవాయపాలెం సమీపంలోని ఖాదర్‌వలి బాబా దర్గా వద్ద అన్నదానం ఏర్పాటు చేసి మత సామరస్యం చాటారు. ముస్లింలు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పిలుస్తూ భోజనం వడ్డించారు. మెట్ల మార్గం ప్రారంభంలోని కేశఖండనశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. భక్తులు అధికసంఖ్యలో తలనీలాలను సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పుణ్యస్నానాలు..

తిరునాళ్లలో భాగంగా ఏర్పాటు చేసిన బొమ్మల దుకాణాల వద్ద చిన్నారులు తమ తల్లిదండ్రులతో వెళ్లి బొమ్మలు కొనుగోలు చేసారు. గ్రామీణ నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో నిరంతరం భక్తులకు తాగునీరు సరఫరా చేశారు. కొండ దిగువన చిలకలూరిపేట 10ఆర్ మేజర్ కాల్వలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కాలువలో పూర్తిస్థాయి నీరు ప్రవహిస్తుండటంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు గజఈతగాళ్లను అప్రమత్తంగా ఉంచారు. స్త్రీలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొండకు వెళ్లే రోడ్డు మార్గంలో మూడంచెలుగా చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి ప్రైవేటు వాహనాల రద్దీని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. కొండ దిగువన ప్రైవేటు వాహనాలను కట్టడి చేశారు.



క్యూలైన్లలో భక్తుల రద్దీ



త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకుంటున్న భక్తులు



కోటప్పకొండపై భారీ శివలింగం వద్ద భక్తులు



అమరావతిలో అమరేశ్వరుని దర్శనానికై క్యూలైన్లలో ఉన్న భక్తజనం

ఏలేశ్వరం.. సుమనోహరం

- ఏలేశ్వరం స్వామి గట్టుకు పోటెత్తిన భక్తులు
- ఏపీ టూరిజంకు రూ.3.60 లక్షల ఆదాయం



ఏలేశ్వరం స్వామి దేవాలయానికి వెళ్తున్న భక్తులు



ఏలేశ్వరం స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

విజయపురిసౌత్: శ్రీశైల క్షేత్రానికి ఈశాన్య ద్వారంగా మహోన్నత దేవాలయంగా ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్ జలాశయం మధ్యన సింహపురి కొండపై వెలసిన ఏలేశ్వరం స్వామి జాతరకు బుధవారం మహా శివ రాత్రిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు భారీగా తరలి వచ్చారు. ఏలేశ్వరం గట్టు హర నామస్మరణతో మారుమోగింది. అర్చకుడు శ్రీ పాద సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఏలేశ్వరస్వామి ఆలయం, అనుపులోని రంగనాథస్వామి ఆలయాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఏలేశ్వర స్వామి ఆలయంలో రాత్రి 12 గంటలకు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అనుపు నుంచి ప్రత్యేక లాంచీ సర్వీసులను ఏలేశ్వరం గట్టుకు నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనుపు వద్ద విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏపీ పర్యాటక శాఖకు లాంచీల ద్వారా రూ.3.60 లక్షలు ఆదాయం చేకూరినట్లు లాంచీ యూనిట్ మేనేజర్ అడపా శివారెడ్డి తెలిపారు. ఏలేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చిన్నరామ స్వామి, లాంచీ యూనిట్ సిబ్బంది వినయ తుల్లా, పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే విజయపురి సౌత్‌లోని లాంచీస్టేషన్ వద్ద శివాలయం, శ్రీ గంగా పార్వతీ సమేత అమరలింగేశ్వర స్వామివారి ఆలయం, భైరవుని పాడులోని కాలభైరవేశ్వర ఆలయం, శివ నాగేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విధి ఆటలో నలిగిన స్నేహం

- ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరు బాలురు దుర్మరణం
- క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లి వస్తుండగా ఘటన
- పండుగ పూట రెండు కుటుంబాల్లో విషాదం



సంతోష్ కుమార్ (ఫైల్)



కూరపాటి లిఖిత్ (ఫైల్)

సత్తెనపల్లి: వారిద్దరూ ప్రాణ స్నేహితులు.. తరగతులు, వయసులు, పాఠశాలలు.. వేరేనే.. కానీ మనసు మాత్రం ఒక్కటే. సెలవు వస్తే ఎక్కడికైనా కలిసే వెళతారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు బుధవారం సెలవు రావడంతో కొద్దిసేపు సరదాగా కలిసి ఆడుకునేందుకు పొద్దు పొద్దునే బయలు దేరారు. ద్విచక్రవాహనం పై ఆటలకు వెళ్లి వస్తుండగా వీరి అన్యోన్యతపై విధికి కన్నుకుట్టింది. ఇద్దరినీ బలి తీసుకుంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అచ్చంపేట రోడ్‌లో గల సాయికృష్ణ సినిమా థియేటర్ దగ్గరలో బుధవారం ఈ దారుణం చోటుచేసుకుంది. పండుగ పూట రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని వడ్డవల్లి బ్రహ్మం గారి గుడి ప్రాంతంలో నివసించే తోట సంతోష్ కుమార్ (15) పట్టణంలోని భాష్యం స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్కూలుకి సెలవు ఇవ్వడంతో క్రికెట్ ఆడుకునేందుకు ఉదయాన్నే తన ఇంటి దగ్గర ఉండే స్నేహితుడు లింటిల్ ఏంజల్స్‌లో 5వ తరగతి చదివే కూరపాటి లిఖిత్(11) ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై వావిలాల గోపాలకృష్ణయ్య మెమోరియల్ పార్కు దగ్గరకు వెళ్ళారు. అక్కడ మిత్రులు ఎవరూ కనిపించక పోవడంతో మళ్లీ తిరిగి ప్రయాణం అవుతూ అచ్చంపేటరోడ్‌లోని రైల్వేగేట్ వద్ద నుంచి సాయి కృష్ణ సినిమా థియేటర్ వైపు వస్తూ పాత లిక్కర్ మాల్ సమీపంలో రోడ్డుమీద నిర్లక్ష్యంగా ఆపి ఉంచిన గడ్డి మోపు ట్రాక్టర్ సైడ్ ఉండేటువంటి డోర్లు తీసి ఉంచడంతో ఉదయాన్నే 7 గంటల ప్రాంతంలో మంచు కురుస్తూ ఉండడంతో అది కనపడని సంతోష్ కుమార్ వెళ్లి ఆ ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం తగిలి సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున లిఖిత్ మెడ నరాలు విరిగి కింద పడిపోవడంతో స్థానికులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ లిఖిత్ తుదిశ్వాస విడిచాడు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. ఇరువురి మృతదేహాలకు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుల కుటుంబ సభ్యులకు అందించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పండగ రోజు రెండు నిండు ప్రాణాలు కోల్పోవడంతో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

ఒక్కగానొక్క కొడుకు..

ఒక్కగానొక్క మగబిడ్డ, వంశోద్ధారకుడ్ని లేకుండా చేశావా శివయ్యా.. అంటూ కూరపాటి లిఖిత్ తల్లిదండ్రులు సుధీర్, సుజాతలు విలపించారు. రోడ్డు ప్రమాద వార్త తెలియగానే మృతుడి తల్లి సుజాత ఇంటిలో స్పృహతప్పి పడిపోయింది. కూరపాటి సుధీర్, సుజాత దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సుధీర్ పట్టణంలో ఫ్యాన్సీ దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆడుకునేందుకు స్నేహితుడితో కలిసి వెళ్లి రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందటంతో జీర్ణించుకోలేక లిఖిత్ మృతదేహన్ని గుండెలకు హత్తుకుంటూ రోదించారు.

ఆటలంటూ అనంత లోకాలకు ...

మంగళవారం సాయంత్రం వడ్డవల్లి నుంచి విద్యుత్ ప్రభలు కోటప్పకొండకు పయనమయ్యే సమయంలో సరదాగా గడిపిన బిడ్డ ఆటలంటూ పొద్దు పొద్దునే వెళ్లి అనంత లోకాలకు వెళ్లావయ్యా అంటూ మృతుడు తోట సంతోష్‌కుమార్ తల్లిదండ్రులు జానకీరామ్, నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. జానకీరామ్‌కు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జానకీరామ్ కోళ్ల ఫారం, కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. రెండువ కుమారుడు సంతోష్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో పండుగ పూట మృతి చెందడం జీర్ణించుకోలేక విలపించారు.

క్వారీ కిటకిట

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బాలకోటేశ్వరస్వామిని దర్శించుకుని తరించారు. ఆలయ ఆవరణకు సుమారు 15 భారీ విద్యుత్ ప్రభలు చేరుకున్నాయి. వందల సంఖ్యలో చిన్న, బాల ప్రభలు తరలివచ్చాయి. స్వామి దర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ట్రైనీ ఐపీఎస్ దీక్ష ఆధ్వర్యంలో తెనాలి డీఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో 12 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, 300 మందికిపైగా పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఆలయ సమీపంలో అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద పులిహోర, పొంగలి, లడ్డూ, మజ్జిగ పంపిణీ చేశారు.

